వివిధ వంటకాలతో విద్యార్థులు

కేయూ ఇంజినీరింగ్ కాలేజీలో టెక్నో సందడి

తొలిరోజు సంప్రదాయ దుస్తులతో అలరించిన విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 : కాకతీయ యూనివర్సిటీ కో–ఎడ్యుకేషన్ ఇంజినీరింగ్ కాలేజీలో టెక్నో సందడి మొదలైంది. రెండు రోజుల పాటు నిర్వహించే ఇల్యుమిన –2025లో భాగంగా మొదటి రోజు ఆదివారం ఇంజినీరింగ్ విద్యార్థులు సంప్రదాయ దినోత్సవం నిర్వహించారు. ఇంజినీరింగ్ టెక్నో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. కాలేజీ ఆవరణలో సంప్రదాయ వంటకాలు తయారు చేసుకుని తోటి విద్యార్థులకు పంచి తింటూ సందడి చేశారు. అధ్యాపకులకు విద్యార్థినులు మెహందీ డిజైన్లు వేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎలక్ట్రికల్స్, కంప్యూటర్స్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ విభాగాల విద్యార్థులు ఫొటో ఫ్రేమ్స్ సుందరంగా తయారు చేశారు. ఫొటోలను విభిన్న రూపాల్లో ఆకర్షణీయంగా సృష్టించారు. గ్రూపు ఫొటోలతో అదరగొట్టారు. సాయంత్రం ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీ కో–ఎడ్యుకేషన్ కాలేజీ స్పోర్ట్స్, కల్చర్ డేను సోమవారం సాయంత్రం నిర్వహించనున్నారు.

ఇల్యుమిన – 2025 టెక్నోలో ఫొటోఫ్రేమ్స్‌లో విద్యార్థులు

వేలేరు : బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన పోలీసులు

హసన్‌పర్తి : బైరాన్‌పల్లిలో రాజేందర్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

అక్రమ అరెస్టులు సిగ్గుచేటు

- రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు ఇదే నిదర్శనం
- ఆరు గ్యారెంటీలు అమలు చేయలేని అసమర్థ సర్కారు
- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి
- బీఆర్ఎస్ నేతల నిర్బంధంపై ఆగ్రహం

సుబేదారి : బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన కేయూసీ పోలీసులు

సుబేదారి, మార్చి 16 : అక్రమ అరెస్టులు సిగ్గుచేటు అని, రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు ఇదే నిదర్శనమని కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌కు వచ్చిన సందర్భంగా నగరంలోని సుబేదారి, కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఆదివారం తెల్లవారు జాము నుంచి బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి, పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు. కేయూసీ పోలీసులు కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, విద్యార్థి నాయకులు కొమురయ్య, దామోదర్, రాజేందర్‌ను ముందస్తుగా అరెస్ట్ చేశారు. సుబేదారి పోలీసులు విద్యార్థి నాయకులు ప్రశాంత్, వీరస్వామి, రాజేశ్, మాజీ జడ్పీటీసీ మారెపాక రవిని అరెస్ట్ చేశారు. సీఎం పర్యటన ముగిసిన తర్వాత వదిలిపెట్టారు. ఈ సందర్భంగా మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ.. తమది ప్రజాపాలన ప్రభుత్వమని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి నిరంకుశంగా బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేశారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వమని ధ్వజమెత్తారు. విద్యార్థి నాయకుడు ప్రశాంత్ మట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, భయభ్రాంతులకు గురిచేస్తున్నది, బెదిరింపులకు భయపడేది లేదని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు పోరాడుతామన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్..

వేలేరు/హసన్‌పర్తి : స్టేషన్ ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మహసభను అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆదేశాల మేరకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి నిర్బంధించారు. సీఎం సభను అడ్డుకునేందుకు పార్టీ మండల ఇన్‌చార్జి ఇట్టబోయిన భూపతిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు సిద్ధమవగా పోలీసులు అరెస్ట్ చేసి వేలేరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఉదయం 7గంటలకు అరెస్ట్ చేసి మధ్యాహ్నం 3:30 గంటలకు విడుదల చేశారు. భూపతిరాజ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కొయ్యడ మహేందర్, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మాధవరెడ్డి, మాజీ కో ఆప్షన్ మెంబర్ జానీ, మండల కో ఆర్డినేటర్ గొవింద సురేశ్, నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఇట్టబోయిన సంపత్‌ను అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్వీ కేయూ ఇన్‌చార్జి జట్టి రాజేందర్‌ను శనివారం అర్ధరాత్రి మండలంలోని బైరాన్‌పల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి మెరుగైన ర్యాంకు కోసం కృషి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

పబ్లిక్ టాయ్‌లెట్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్, మార్చి 16 : స్వచ్ఛ సర్వేక్షణ్ – 2024లో గ్రేటర్ కార్పొరేషన్ మెరుగైన ర్యాంకు సాధించేలా కృషి చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం బల్దియా ఆవరణలోని షీ టాయ్‌లెట్‌తో పాటు హనుమకొండలోని డీఈవో కార్యాలయం, అదాలత్ సెంటర్‌లోని పబ్లిక్ టాయ్‌లెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గ్రేటర్ కార్పొరేషన్‌కు ఓడీఎఫ్ ప్లస్.. ప్లస్ సర్టిఫికెట్ వచ్చేలా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ ఉండాలన్నారు. ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. అదాలత్ సెంటర్‌లోని ప్రజా మరుగుదొడ్డి నీటి సౌకర్యం లేక మూసివేశామని తెలుపడంతో వెంటనే బోర్ వేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లలో స్వచ్ఛ సర్వేక్షణ్ సంబంధిత అంశాలను స్పష్టంగా పెయింటింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో రాజేశ్ పాల్గొన్నారు.

20న బల్దియా బడ్జెట్ సమావేశం

వరంగల్, మార్చి 16 : ఈ నెల 20న బల్దియా బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నారు. 2025–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ రూపకల్పనపై మేయర్ గుండు సుధారాణి సమీక్ష చేశారు. దీంతో అధికారులు బడ్జెట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. అన్ని విభాగాల నుంచి ఖర్చులు, కేటాయింపుల లెక్కలు తెప్పించుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశానికి హాజరుకానున్నట్లు సమాచారం.

జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

హనుమకొండ చౌరస్తా, మార్చి 16 : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్)లో జరుగుతున్న తెలంగాణ 10వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పురుషులు, మహిళల పోటీలు ముగిశాయి. ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 1 వరకు ఒడిరాష్ట్రం భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశామని, 16 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారని వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు బీఆర్ అంబేద్కర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అల్వాల రాజ్‌కుమార్, గోకారపు శ్యామ్‌కుమార్ తెలిపారు. పురుషుల విభాగంలో ఎండీ యాసిన్(మహబూబ్‌నగర్), సుజాయత్(మహబూబ్‌నగర్), డీ ప్రకాశ్(హనుమకొండ), జీ మధు(వరంగల్), మహిళల విభాగంలో జీ అఖిల(హనుమకొండ), బీ జ్యోతి(వరంగల్), జీ నవ్య(హనుమకొండ), జీ మమత(మహబూబ్‌నగర్) ఉన్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. టెన్నికాయిట్ క్రీడ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర టెన్నికాయిట్ కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి జహూర్, సీనియర్ క్రీడాకారులు ఎడ్ల సురేందర్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

మళ్లీ పనిచేయని ఏసీలు

- కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిలిచిన ఆపరేషన్లు
- గత ఫిబ్రవరిలోనే చేపట్టిన మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వైద్యులు, రోగులు

వరంగల్ చౌరస్తా, మార్చి 16 : కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మళ్లీ ఏసీలు పనిచేయడం లేదు. గత ఫిబ్రవరిలోనే వీటికి మరమ్మతులు చేయగా, నాలుగు రోజుల నుంచి పాత పరిస్థితే పునరావృతమవుతున్నది. దీంతో వైద్యాధికారులు శస్త్ర చికిత్సలు నిలిపివేశారు. కేవలం మైనర్ ఆపరేషన్లు చేస్తున్న వైద్యులు, మేజర్ శస్త్రచికిత్స అవసరమున్న రోగులను వారం రోజుల తర్వాత రావాలంటూ ఇంటికి పంపిస్తున్నారు. ఆపరేషన్లు చేసే సమయంలో గది ఉష్ణోగ్రత ఒకే విధంగా ఉండాలి. అలా లేకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పేదలు ఉచిత వైద్యానికి దూరమవుతున్నారు. వేసవికి ముందే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని రోగులు ఆందోళన చెందుతున్నారు. ఆస్పత్రి సామర్థ్యానికి అనుగుణంగా ఏసీలు బిగించినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో చీటికిమాటికి మరమ్మతుకు గురవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి ఆపరేషన్లు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ఫిబ్రవరి 6వ తేదీన ఏసీ యంత్రాలకు మరమ్మతులు చేస్తున్న టెక్నీషియన్ (ఫైల్)

చిరునవ్వుతో సేవ చేయండి

మడికొండ, మార్చి 16 : ప్రతి ఒక్కరూ చిరునవ్వుతో సేవ చేయాలని కోయంబత్తూరుకు చెందిన లయన్స్ అంతర్జాతీయ మాజీ డైరెక్టర్ రామకృష్ణమూర్తి సూచించారు. మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్లో ఆదివారం 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మల్టీపుల్ స్థాయిలో వరంగల్ ఉమ్మడి జిల్లాతో కూడిన 320ఎఫ్‌కు గొప్ప పేరుందని కొనియాడారు. వెంకట్‌రెడ్డి నాయకత్వంలో చారిటబుల్ కంటి ఆస్పత్రితో పాటు ఇతర అవసరార్థులకు నిర్వహించిన సేవలు వెలకట్టలేనివన్నారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రిటెన్షన్లను మినహాయిస్తే 600 మంది కొత్త సభ్యులు, 6 నూతన క్లబ్‌లతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలో మహబూబాబాద్, జనగామ, తొర్రూర్, హనుమకొండకు ఆరు ప్రాంతీయ సదస్సులను లక్ష్యాలకనుగుణంగా నిర్వహించుకున్నామని చెప్పారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 70 లయన్స్ క్లబ్‌ల నాయకులు నిర్వహించిన బ్యానర్ ప్రజెంటేషన్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 2025–26 లయనిస్టిక్ సంవత్సరానికి 320 ఎఫ్ జిల్లా గవర్నర్‌గా డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, మొదటి జిల్లా గవర్నర్‌గా క్లబ్ ఆఫ్ హనుమకొండ ఫౌజండ్ పిల్లర్స్‌కు చెందిన నరహరి సుధాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మల్టీపుల్ నాయకులు నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్య, ఆవుల గోపాల్‌రావు, పూర్వ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కన్నా పరశురాములు, ప్రస్తుత కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, రాంగోపాల్‌రావు పాల్గొన్నారు.

రామకృష్ణమూర్తిని సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి, పంచుతా
- అప్పు చేసి తినే పప్పు కూడుతో రాష్ట్రానికి ముప్పు
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

2 లక్షల మాఫీ అందరికీ చేయలే...

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

ఆర్థిక నిపుణుల విస్మయం

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఆర్బీఐ డాటాను వారు గుర్తుచేస్తున్నారు.

ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025–26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం.

ప్రగతి సభలో సీఎంకు నిరసనసెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలుఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్ డ్యాన్సులు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన – ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తుచేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇక దించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అసలు కాంగ్రెస్ నేతల దూరం

బీఆర్ఎస్ తరపున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

పిల్లలతో డ్యాన్సులు..

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

రేవంత్ అన్న..?

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చిన వారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతో పాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు

సీఎం రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పంటలు ఎండిపోవడంతో సీఎం రేవంత్‌పై ఆగ్రహంగా ఉన్న రైతులు, నేతలు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సూచనల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు విడిచిపెట్టారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై అవుతారని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని మంత్రి రాజయ్య విమర్శించారు.

మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను గృహనిర్బంధం చేసిన పోలీసులు

లక్షన్నర కోట్ల అప్పుతో ప్రజలకు ఒరిగిందేమిటి?

- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆరు గ్యారెంటీలను ప్రటించిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. ఈ అప్పులతో ప్రజలకు ఒరిగిందేమిటి? రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకునేందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ రెండునెలలుగా వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు.

రేవంత్.. ప్రజలే మీ బట్టలిప్పుతరు

- సీఎంపై ఏలేటి విమర్శలు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డికి బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏంటో అర్థం కావడంలేదని చురకలంటించారు. అది చట్టసభలో ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా అని నిలదీశారు. "ప్రజలు మీ బట్టలు విప్పేందుకు రెడీ అయితున్నారు. ముందు దానిమీద దృష్టి పెట్టండి" అని హితవు పలికారు. బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తున్నారని విమర్శించారు. ఇది హామీల ఎగవేతల, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. తాను గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేశారని, పసలేని జవాబులు చెప్పారని తీవ్రంగా మండిపడ్డారు.